క్లుప్తంగా

హెల్మెట్ ధారణపై అవగాహన



హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

సీతంపేట : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.విశ్వనాథం ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, మహారాణిపార్లర్ కూడలి మీదుగా తిరిగి స్కూల్ సాగింది. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారికి సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ ధరించాలని, సీటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పక హెల్మెట్ పెట్టుకోవాలని ఎన్‌సీసీ క్యాడెట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు విద్యార్థినుల ఎంపిక



స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ

మహారాణిపేట: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ ఉమెన్ జూనియర్ కాలేజీ విద్యార్థినులు పి.శ్రీప్రద, డి.గమని భీమిలిలో జరిగిన ఎంపిక శిబిరంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 బాస్కెట్ బాల్ టీమ్‌కు ఎంపికయ్యారు. ఇలా రాష్ట్ర స్థాయి ఇద్దరు విద్యార్థినులు ఎంపిక కావడం విశేషమని, వారిని అభినందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజి తెలిపారు. ఒలింపిక్ క్రీడా సంవత్సరం కావడంతో కళాశాలలో క్రీడల పట్ల మరింత దృష్టి పెట్టి మెరుగైన శిక్షణ, సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎంపిక



మానవసేవే మాధవ సేవ నూతన కార్యవర్గం

మురళీనగర్ : మానవ సేవే మాధవ సేవ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎస్.సీతారామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కేవీఎస్ఎస్ ప్రసాద్, డి.వరప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శిగా వై.త్రిమూర్తి, కోశాధికారిగా కేవీ వర్మ, సంయుక్త కార్యదర్శిగా టి.వెంకటేష్, ఉప కార్యదర్శులుగా పి.సంతోష్ కుమార్, పి.సతీష్, టి.సూరిబాబు, నిర్వహణ కార్యదర్శులుగా బి.వెంకటేష్, పి.వెంకటరావు, పీఎస్ఆర్ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నకయ్యారు. గౌరవాధ్యక్షుడు డి.ప్రసాదరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం ఏడాది పాటు అధికారంలో ఉంటుంది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



దుకాణదారుడితో మాట్లాడుతున్న కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి

మర్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం బీఆర్‌టీఎస్ మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలపై కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ట్రాఫిక్ సీఐ ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసేవారికి, రోడ్డుపై ఇష్టానుసారం రాంగ్ పార్కింగ్ చేసేవారికి అవగాహన కల్పించారు. ఎల్లప్పుడూ రద్దీగా ఉండే మర్రిపాలెం మెయిన్ రోడ్డులో నిత్యం వేలాది మంది ప్రయాణాలు సాగిస్తారని, పాదచారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ డ్రైవ్ చేపట్టామని అన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు మొలిచిన మండపం గోడలు



మండపం లోపల చెత్తాచెదారాలు



మండపం ఆవరణలో మద్యం సీసాలు

ఆ వేదిక.. అనువు కాదిక

- నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం శిథిలం
- నిరుపయోగంగా మారిన వైనం
- అసాంఘిక కార్యకలాపాలతో స్థానికుల ఇక్కట్లు
- వినియోగంలోకి తేవాలని ప్రజల వినతి

అదొక కల్యాణ మండపం.. అయినప్పటికీ అక్కడ వివాహాలు జరగడం లేదు. ఘనత వహించిన జీవీఎంసీ జోన్–3 అధికారుల పుణ్యమా అని ఇటు మరమ్మతులు జరగక, అటు టెండర్లు పిలవక ఆ కల్యాణ మండపం శిథిలమై.. స్థానికులకు ఉపయోగపడకుండా ఉండిపోయింది. తక్కువ అద్దెతో ప్రజలు ఏ శుభకార్యం చేసుకోవడానికైనా అనుకూలంగా ఉండే ఆ కల్యాణ మండపానికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



వివేకానంద కల్యాణ మండపం



మండపంలో అద్దె.. ఇతర వివరాలు సూచించే బోర్డు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 పరిధి 24వ వార్డు నక్కవానిపాలెం జీవీఎంసీ వివేకానంద కల్యాణ మండపం సభలు, సమావేశాలు, వివాహాలతో కళకళలాడేది. మండపం అద్దె రూ.14 వేల 500. చాలా తక్కువగా ఉండేది. ఇదంతా గతం. గత ఏడాది కల్యాణ మండపం కాంట్రాక్ట్ కాలపరిమితి ముగియడంతో జోన్–3 రెవెన్యూ విభాగం అధికారులు కల్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరమ్మతులు చేస్తామని చెప్పినా ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. అప్పటి నుంచి ఇక్కడ శుభకార్యాలు జరగని పరిస్థితి నెలకొంది. నాటి మేయర్ డి.వి.సుబ్బారావు హయాంలో నిర్మించిన ఈ కల్యాణ మండపాన్ని 1990లో అప్పటి రెవెన్యూ మంత్రి డీకే సమరసింహారెడ్డి ప్రారంభించారు. టెండర్లు పిలవడం ద్వారా కాంట్రాక్టర్లు ఈ కల్యాణ మండపం నిర్వహిస్తున్నారు. ఈ కాంట్రాక్ట్ కాలపరిమితి ముగియడం, జీవీఎంసీ స్వాధీనం చేసుకుని నెలలు గడుస్తున్నా మరమ్మతు పనులు మాత్రం ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది. చుట్టుపక్కల ప్రాంతాలైన సీతమ్మధార, గాంధీనగర్, నక్కవానిపాలెం, టీపీటీ కాలనీ, కేఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల ప్రజలు శుభకార్యాలు, సభలు, సమావేశాల కోసం ఈ కల్యాణ మండపాన్ని ఆశ్రయిస్తుంటారు. పలు రాజకీయ సమావేశాలు కూడా ఇక్కడ జరుగుతుంటాయి. ప్రస్తుతం ఎటువంటి ఫంక్షన్లు చేద్దామంటే ఈ కల్యాణ మండపం అందుబాటులో లేక దూరంగా వున్న ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయనందునే ఈ కల్యాణమండపం కొంత వరకు శిథిలావస్థకు చేరుకుందని అంటున్నారు. మండపం మరమ్మతులు చేయాలంటే సుమారు కోటిన్నర దాకా ఖర్చవుతుందని చెబుతున్నారు.

అసాంఘిక కార్యలాపాలకు అడ్డా..

కొంత కాలంగా వినియోగంలో లేని కల్యాణమండపం వద్ద కనీసం సెక్యూరిటీ లేదు. మండపానికి తాళం వేసే నాథుడు కూడా లేడు. ఫలితంగా చుట్టుపక్కల గల ఆకతాయిలు ఇక్కడ జూదం, మద్యపానం వంటివి యథేచ్ఛగా కానిస్తున్నారు. మండపాన్ని మరుగుదొడ్డిగా మార్చేసారు. అసాంఘిక కార్యకలాపాలకు సైతం పాల్పడుతున్నారని స్థానిక ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. జోన్–3 అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్యాణ మండపం లోపల భాగం అంతా చిందరవందరగా ఉందంటే నిర్వహణ తీరు ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జోన్–3 అధికారులు ఈ మండపాన్ని స్వాధీనం చేసుకున్నామన్న విషయం మరిచిపోయారేమో అని స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



మండపం శిలాఫలకం

మరమ్మతు చేయాలి..



నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపానికి మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకు రావాలి. గతంలో మండపంలో కల్యాణాలు జరిగాయి. పాడైన తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైయింది. మండపాన్ని మరుగుదొడ్డిగా తయారు చేశారు. జీవీఎంసీ అధికారులు స్పందించి మండపానికి పూర్వ వైభవంగా కల్పించాలి.

గుడ్ల అశోక్‌రెడ్డి, క్రాంతి నగర్

పూర్వ వైభవం తీసుకురావాలి..

వివేకానంద కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి పూర్వ వైభవం తీసుకు రావాలి. తక్కువ అద్దెలో అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉన్న ఈ కల్యాణ మండపంలో ఎన్నో శుభ కార్యాలు జరిగేవి. ఇది శిథిలం అయ్యాక స్థానికులు ఏ కార్యక్రమం చేసుకోవాలన్నా ఇబ్బంది పడుతున్నారు. ఈ కల్యాణ మండపాన్ని రిపేర్ చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. జీవీఎంసీ కమిషనర్, అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– గుజ్జు లోకేశ్వరరెడ్డి, నక్కవానిపాలెం

కౌన్సిల్‌లో చర్చించా..



రెండు సంవత్సరాల క్రితం కౌన్సిల్‌లో కల్యాణ మండపంపై చర్చించాను. నూతన భవనానికి మూడు ఫ్లోర్ల కోసం రూ.8 కోట్లు మంజూరు చేయాలని గతంలో కమిషనర్, మేయర్‌ను కోరాను. అందరికీ అందుబాటులో ఉండే ఈ కల్యాణ మండపం పూర్తి చేసేందుకు చర్యలు తక్షణం చర్యలు తీసుకోవాలి.

– సాడి పద్మారెడ్డి , 24వ వార్డు కార్పొరేటర్

దుర్గాదేవి ఉత్సవాలకు ఏర్పాట్లు



నక్కవానిపాలెంలో ఏర్పాటు చేస్తున్న నవరాత్రి ఉత్సవాల పందిరి

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని పలు ప్రాంతాల్లో శ్రీ దుర్గాదేవి ఉత్సవాలు జరిపేందుకు నిర్వాహకులు శరవేగంగా సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగం లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇక్కడి గాంధీనగర్‌లో దుర్గాదేవి ఉత్సవాలకు భారీ సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు గుప్తాజీ తెలిపారు. మండపం ఎంట్రన్స్, బయటికి వెళ్లే మార్గాల వద్ద ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అక్టోబర్ 3వ తేదీన దుర్గాదేవి ప్రతిష్ఠ జరుగుతుందని, 12న అనుపు మహోత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కుంకుమార్చనలు, భజన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

రైతుబజారులో స్వచ్ఛతాహీ సేవ



రైతుబజారులో పరిసరాలు శుభ్రం చేస్తున్న జెడ్సీ రాము, ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం రైతుబజారులో స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమాన్ని సోమవారం జోన్–5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందన్నారు. రైతుబజారు పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా ఎస్టేట్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ముందుగా స్వచ్ఛతాహీ సేవా 2024లో భాగంగా పరిసరాలు శుభ్రం చేశారు. చెత్తా చెదారాలు తరలించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దనరావు, రైతుబజార్ ఈవో సీహెచ్ కృష్ణమూర్తి, 54,55,56,57 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సింహాచలం నాయుడు, కార్తీక్, జె.రమేష్, కిరణ్‌కుమార్, రైతుబజార్ అటెండర్ దిలీప్, రైతులు, వినియోగదారులు, జోనల్ సిబ్బంది, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కుక్క హల్‌చల్



రైతుబజార్‌లో వృద్ధురాలి కాలిపై కరిచిన కుక్క



కుక్కని పట్టుకున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార : స్థానిక రైతుబజార్‌లో కుక్కల బెడదతో వినియోగదారులు హడలిపోతున్నారు. సోమవారం బజారులో మద్దిలపాలేనికి చెందిన వెంకటమ్మని కుక్క కరవడంతో వినియోగదారులు, రైతులు బెంబేలెత్తిపోయారు. ఈ కుక్క ఇప్పటి వరకు పది మంది రైతులు, వినియోగదారులను కరవడంతో వారు చికిత్స కోసం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రైతుబజారుకు రావాలంటే భయంగా ఉందని వినియోగదారులు చెబుతున్నారు. నిత్యం వినియోగదారులు, రైతులు, సిబ్బందితో రద్దీగా ఉండే ఈ బజారులో కొన్ని కుక్కలు తిష్టవేసి అందరినీ భయపెడుతున్నాయి. బజారంతా ఇష్టానుసారం స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక్కడ వాచ్‌మేన్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి కుమారుడు కూడా కుక్క బాధితుల్లో ఒకడు కావడం విశేషం. దీనిపై జోనల్ కమిషనర్ శివప్రసాద్‌కు వివరించడంతో సాయంత్రం జీవీఎంసీ సిబ్బంది పట్టుకున్నారు. దీంతో రైతులు, వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు. సాక్షికి అభినందనలు తెలిపారు.

నేడు వృద్ధుల దినోత్సవం

మురళీనగర్ : మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్డర్స్ డే (వృద్ధుల దినోత్సవం) నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిరాశ్రయులు, ఆసరా లేదని వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తామని చెప్పారు. వనితా వాకర్స్ క్లబ్ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

బైక్‌కు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు



అగ్నికి ఆహుతవుతున్న బైక్

మర్రిపాలెం : తన బైకుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని ఓ ఏఆర్ కానిస్టేబుల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డి.కృష్ణారావు ఏఆర్ రిటైర్డ్ కానిస్టేబుల్. కంచరపాలెం జై భారత్‌నగర్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి సుమారు 1 గంట సమయంలో తన ఇంటి ముందు పార్కున హోండా ఏక్టివా బైకు (ఏపీ39హెచ్‌ఏ7010)కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. అది గమనించిన అతను బయటికి వచ్చి చూసేసరికి బైకు కాలిపోతూ కనిపించింది. ఈ క్రమంలో బాధితుడు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం బాధితుడు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవరాత్రి మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామ కమిటీ ప్రతినిధులు

సీతమ్మధార : రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో భూలోకమాత శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 3వ తేదీ నుంచి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు బేరి గురుమూర్తిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆలయం వద్ద నవరాత్రికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 4 నుంచి జలాభిషేకం, 5 గంటలకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతతో అభిషేకాలు, 6.30 నుంచి 7.30 గంటల వరకు అమ్మవారికి దివ్య అలంకరణ అనంతరం దర్శనలు జరుగుతాయన్నారు. 3న శ్రీబాలాత్రిపుర సుందరి అలంకరణ, 4న శ్రీగాయిత్రీ దేవి, 5న అన్నపూర్ణదేవి, 6న లలితా త్రిపుర సుందరీ దేవి, 7న మహచండీ అలంకరణ (భూలోకమాత), 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరీవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శమిస్తారు. 5వ తేదీన అన్నపూర్ణాదేవి అవతారం రోజున మహా అన్నాభిషేకం, 10వ తేదీన దుర్గాదేవి అవతారం రోజున సాయంత్రం 6 గంటల నుంచి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి అమ్మవారికి తిరువీధి (ఊరేగింపు) జరుగుతుందనితెలిపారు.

ఊమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో..

24వ వార్డు, నక్కవానిపాలెంలోని శ్రీ ఊమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో క్రోధి నామ సంవత్సరం సందర్భంగా దసరా మహోత్సవాలు అక్టోబర్ 3 నుంచి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కుంకుమ పూజ చేయించుకోవాలనుకున్న భక్తులు రూ.50 రుసుము చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. 12వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు శ్రీషిర్డీ సాయి బాబా సమాధి మహోత్సవ దినం సందర్భంగా బాబా ఆలయంలో సహస్ర దీపారాధన జరుగుతుందన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతుల స్వీకారం



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

సీతమ్మధార : అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు విద్యార్థులకు సంబంధించి కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం సుమారు 9 అర్జీలు వచ్చాయి. ఈ కార్య క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ, ఇబ్రహీం, వీఆర్‌వోలు, కార్యదర్శులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణం పరిష్కరించాలి

కంచరపాలెం : జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2 వినతులు అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. వినతులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఇంజినీరింగ్ ఈఈలు మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, ఏసీపీ ఇన్‌చార్జి విజయకుమార్, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, ఈఈ సూరిశెట్టి శేఖర్, ఏఈ మోహన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జెడ్సీ బొడ్డేపల్లి రాము



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

కంచరపాలెం: జోనల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు సక్రమంగా మౌలిక సదుపాయాలు కల్పించగలమని జోన్–5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. జ్ఞానాపురంలోని జోన్–5 జోనల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు గల పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలో కొండవాలు, మురికివాడలు, పారిశ్రామిక ప్రాంతాలు అధికంగా ఉండడంతో అభివృద్ధి పనులు పూర్తికావడానికి జాప్యం జరుగుతోందన్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జోన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ వార్డులో సంబంధిత అధికారులతో వార్డు పర్యటన ఉంటుందన్నారు. పారిశుధ్య పనులు పబ్లిక్‌హెల్త్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సమస్యలను ఉపేక్షిస్తే ఉన్నత అధికారులు నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశ్రామిక ప్రాంతాల నుంచి రెవెన్యూ వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ ఆర్‌వోలకు జెడ్సీ సూచించారు. టౌన్‌ప్లానింగ్, విద్యుత్‌లైట్లు, మంచినీరు, కాలువలు, రోడ్లు వంటి సమస్యలపై ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు వస్తున్నాయన్నారు. అధికారులు వార్డుల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

మృతదేహం కేసులో జోరుగా దర్యాప్తు

సీతమ్మధార : అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులోని పుట్టబంగారమ్మ తల్లి (సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి) దరి గెడ్డలో గుర్తు తెలియని మృతదేహం కేసులో ఫోర్తు టౌన్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా ముఖం కుళ్లిపోవడంతో స్థానికుడా లేక వేరే ప్రాంతానికి చెందిన వాడా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎక్కడో గెడ్డలో పడి కొట్టుకొచ్చాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నా అంతు చిక్కడం లేదు. ఇప్పటికే గెడ్డకు సంబంధించిన ప్రాంతాల్లోని ప్రజలను ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నగరంలోని ఏదైనా పోలీస్‌స్టేషన్‌లో 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి అదృశ్యమైన కేసు నమోదైయితే ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నంబర్ 94407–96058కు కానీ స్టేషన్ నంబర్ 08912–710695కు తెలిపాలని కోరారు. హెచ్‌సీ ఈశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డగోలు పార్కింగ్‌తో ఇక్కట్లు



నార్త్ ఎక్స్‌టెన్షన్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక కార్ల పార్కింగ్

సీతమ్మధార : పది కార్లు వరుసగా నిలపడంతో చూసే వారంతా ఎవరైనా రాజకీయ నాయకులు వచ్చారా అనుకుంటున్నారు. సీతమ్మధార, నార్త్‌ఎక్స్‌టెన్షన్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో ప్రైవేట్ ట్రావెల్స్ కార్లు పార్కింగ్ చేశారు. ఈ రోడ్డులో ట్రావెల్స్ కార్యాలయం ఉండటంతో కార్లన్నీ రోడ్డుకు ఇరువైపుల నిలిపి ఉంచడంతో ఇక్కడి అపార్టుమెంట్ వాసులు వారి కార్లు పార్కింగ్ చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అలాగే స్కూల్‌కు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రుల కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడానికి వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

37 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : తెలంగాణలోని నల్గొండకు చెందిన ఫరీద్ బహర్ మహ్మద్ (49) ఒడిశాలో 37 కిలోల గంజాయి కొనుగోలు చేసి మహరాష్ట్రకు చేరవేసేందుకు మూడు సంచులతో నగరానికి చేరుకున్నాడు. రామా టాకీస్ రోడ్డులోని ప్రభుత్వ కంటి ఆస్పత్రి వద్ద ప్రైవేట్ బస్సు కోసం వెయిట్ చేస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్న ద్వారకా సీఐ డి.వెంకటరమణ తన సిబ్బందితో వెళ్తూ బస్సులు నిలిపిన చోట బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించిన అతన్ని విచారించి బ్యాగులు తనిఖీ చేయడంతో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.